సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



కొలువులు ఊడినట్టేనా..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగాలు ఊడినట్టే అనిపిస్తోంది. 8లో ▸



నూనె దుకాణాలపై దాడులు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వంట నూనెల దుకాణాలపై విజిలెన్స్, పౌర సరఫరా, లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. 8లో ▸



స్థలం ఇవ్వలేదని కుటుంబం వెలి

విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వలేదని ఓ కుటుంబాన్ని వెలివేశారు. కామవరపుకోట మండలం ఆడమిల్లిలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 8లో ▸

న్యూస్‌రీల్

అశోక్ కుటుంబ సభ్యులకు మాజీ సీఎం జగన్ పరామర్శ

కామవరపుకోట: ఇటీవల మృతి చెందిన ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నిబద్ధత గల మంచి నాయకుడిని కోల్పోయిందని, పార్టీకి అశోక్ అన్న లేనిలోటు ఎవరూ తీర్చలేనిదని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

పేదల పక్షపాతి ఏచూరి



సీతారాం ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ మోషేనురాజు

భీమవరం: కమ్యూనిస్టు నాయకుడు సీతారామ్ ఏచూరి ఉపాధిహామీ చట్టం, సమాచార హక్కు చట్టాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. భీమవరంలో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీతారామ్ ఏచూరి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఉన్నతవర్గంలో పుట్టి పేదల పక్షాన నిలిచి పోరాడి అగ్రస్థాయి నేతగా ఎదిగిన ఘనత ఏచూరిదే అన్నారు. ఏచూరి చిత్రపటానికి శాసన మండలి చైర్మన్ మోషేనురాజు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మెంటే పార్థసారధి, జనసేన నేత కొటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ఆవాస్ యోజన ప్రత్యక్ష ప్రసారం

భీమవరం (ప్రకాశంచౌక్): పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ జె.ఉదయ భాస్కరరావు తిలకించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ జయంతి వేడుకల్లో కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): విశ్వకర్మ స్ఫూర్తితో విద్యార్థులను ఇన్నోవేటివ్ గా తీర్చిదిద్దాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుక ఘనంగా జరిగింది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ పండుగగా రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీర్వో జె.ఉదయ భాస్కరరావు, లక్కోజు సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు ఏలూరుకు డీజీపీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి డీజీపీ ద్వారకాతిరుమలరావు బుధవారం రానున్నారు. ఏలూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల ఎస్పీలతో క్రైమ్ రివ్యూ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

చేపల మాఫియా వల్లే కొల్లేరు ముంపు

కై కలూరు/మండవల్లి: కొల్లేరు పరీవాహక గ్రామాలు 15 రోజులుగా ముంపు బారిన పడటానికి కొల్లేరు సరస్సులో అక్రమ చేపల చెరువుల మాఫియానే కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. పెద ఎడ్లగాడి, చిన ఎడ్లగాడి ప్రాంతాలను సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ, రామకృష్ణ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం ఆక్రమణల కోరల్లో చిక్కుకుందన్నారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కొల్లేరు అభయారణ్యంలో 25 వేల ఎకరాల చెరువులను ధ్వంసం చేయించారన్నారు. తిరిగి ఆక్రమణలు పెరిగాయన్నారు. కొల్లేరులో ఆక్రమణలు తొలగించాలని, బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరులను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

భలే మంచి చౌక బంగారం

- 9 క్యారెట్ల బంగారు ఆభరణాల కోసం ఎదురు చూపులు
- కేంద్రం ప్రకటనతో రాగానే 9కే బంగారంపై చర్చ
- రూటు మారనున్న గోల్డ్ వ్యాపారం

నరసాపురం: రోజురోజుకు బంగారం ధరలు కొండెక్కి కూర్చుకుంటున్నాయి. నచ్చిన ఆభరణాలు చేయించుకుందామంటే లక్షలు ఖర్చుచేయలేక దిగాలు పడుతున్న మహిళలు ఇప్పుడు 9కే బంగారు ఆభరణాల రాక కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. దేశవ్యాప్తంగా హాల్‌మార్కు సదుపాయంతో తొమ్మిది క్యారెట్ల బంగారం వస్తువులకు అనుమతి ఇవ్వాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విపరీతంగా పెరుగుతున్న బంగారం ధరల నేపథ్యంలో తక్కువ ధరల్లో ఆభరణాల తయారీ పెరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుటుంది. 9కే బంగారం 10 గ్రాముల ధర రూ.30 వేల లోపు ఉండొచ్చని అంచనా. దీంతో బంగారు ప్రియులకు తక్కువ ధరలో ఆభరణాలు చేయించుకునే అవకాశం ఏర్పడుతుంది.



50 శాతం పెరిగనున్న ఆభరణాల తయారీ

ప్రపంచం మొత్తంగా మనదేశంలోనే ఆభరణాల ప్రియులు ఎక్కువ. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే ఆభరణాల ప్రియులు మన గోదావరి జిల్లాల్లోనే ఎక్కువ. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో రోజూ రూ.4 కోట్ల మేర బంగారు ఆభరణాల వ్యాపారం సాగుతుంది. మహిళల విషయాన్ని పక్కన పెడితే గోదావరి జిల్లాల్లో పురుషులు కూడా బంగారు ప్రియులే. ఇప్పుడు ఈ 9కే ఆభరణాలు వస్తే కొనుగోళ్లు ఈ జిల్లాల్లో 50 శాతం వరకూ పెరిగే అవకాశం ఉందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

భవిష్యత్తు 9కే జ్యూయలరీదే



బంగారం వ్యాపారం భవిష్యత్‌లో కొత్త పుంతలు తొక్కనుంది. 9కే ఆభరణాల వ్యాపారం బాగా పెరుగుతుంది. 9కే బంగారం కాసు ధర రూ 22 వేల వరకూ ఉంటుంది. దీంతో మధ్యతరగతి ఎక్కువగా ఆభరణాలు చేయించుకుంటుంది. స్వర్ణకారులకు కూడా పని పెరుగుతుంది. గత రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం ఆభరణాల ఆర్డర్లు తగ్గాయి. కారణం ధరలు. ఇటీవల ధరలు కాస్త తగ్గినా మళ్లీ భారీగానే పెరుగుతాయి. కాబట్టి భవిష్యత్ అంతా 9కే ఆభరణల హవా నడుస్తుంది.

– పాలూరి బాబ్జీ, సుభం జ్యూయలర్స్ అధినేత

24 క్యారెట్ల బంగారం విషయానికి వస్తే 99.9 స్వచ్ఛమైన బంగారం. పెట్టుబడిగా బంగారం కొనేవారు 24 క్యారెట్ల బిస్కెట్ బంగారం కొనుగోలు చేస్తారు. 22 క్యారెట్ల 916 బంగారం ఆభరణాల తయారీలో ఇప్పటి వరకూ రారాజు. 9కే ఆభరణాలు 22 క్యారెట్ల బంగారానికి పోటీ ఇవ్వనుంది. మదుపరులు పెట్టుబడుల కోసం ఎక్కువగా 24 క్యారట్ల బంగారంపై ఖర్చుపెడుతుంటారు. ఇక ఆభరణాల అమ్మకాల విషయంలో ఈ 9కే బంగారం వ్యాపారం గోదావరి జిల్లాల్లో కొత్తరూపు సంతరించుకోబోతుంది. 9కే బంగారంలో బంగారం స్వచ్ఛత 37.5 శాతం ఉంటుంది. అంటే సగం కంటే తక్కువ. మధ్య తరగతి మహిళ ఏడెనిమిది కాసులు బంగారం పెట్టి ఓ హారం చేయించుకోవాలంటే అందులో సగం ధరలోనే 9కే బంగారంతో హారం చేయించుకోవచ్చు. ఈ లెక్కన 9కే ఆభరణాలు తయారీ 916 కేడీయం జ్యూయలరీని మించిపోతుందని చెపుతున్నారు.

స్వర్ణ కారులకు మంచిరోజులు



ఆభరణాలు తయారు చేస్తున్న స్వర్ణకారుడు

నిజానికి 9కే ఆభరణాల తయారీ కొత్త విషయం ఏమీ కాదు. పూర్వం స్వర్ణకారులు 9కే, 18కే, 20కే గోల్డ్‌తో ఆభరణాలు చేసే వారు. ఇప్పుడు చాలా చోట్ల ఈ విధంగా తయారు చేస్తున్నారు. ఇటీవల మిషన్ తయారీ డిజైన్‌ల రాకతో స్వర్ణకారుల వద్ద ఆభరణాలు తయారు చేయించుకునే వారి సంఖ్య తగ్గింది. దీంతో ఉభయగోదావరి జిల్లాల్లో ఉన్న సుమారు 2 వేల మంది స్వర్ణకారుల వృత్తి సంక్షోభంలో పడింది. మళ్లీ 9 కే ఆభరణాల తయారీ పెరిగేతే వీరికి పని పెరిగి పూర్వపు రోజులు వస్తాయనే చర్చ కూడా సాగుతోంది. 1 గ్రామ్ గోల్డ్ రోల్డ్ గోల్డ్ వస్తువుల అమ్మకాలు కూడా రికార్డు స్థాయిలో సాగుతోంది. మరి 9కే ఆభరణాల రాక 1 గ్రామ్ ఆభరణాల మీద ఎలా ఉండబోతుందనే చర్చ కూడా సాగుతోంది.

నులిపురుగులతో రక్తహీనత



భీమవరంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: నులి పురుగులు ఎంతో ప్రమాదకరమైనవని వాటివల్ల రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని చినరంగడిపాలెం మున్సిపల్ హైస్కూల్లో కలెక్టర్ నాగరాణి విద్యార్థులకు స్వయంగా నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. ఎక్కువగా ఆడపిల్లలు రక్తహీనతతో బాధపడుతుంటారని రోడ్ల పక్కన ఫాస్ట్ ఫుడ్స్, చిప్స్ వంటి పదార్థాలను తినకూడదని వాటిలో ఏ విధమైన పోషక పదార్థాలు ఉండవని కలెక్టర్ చెప్పారు. ఐరన్ శాతం ఎక్కువగా ఉండే ఆకుకూరలు, వేరుసెనగ, నువ్వులు ఉండలు వంటి వాటితో పాటు ఇంట్లో తయారుచేసిన పదార్థాలను మాత్రమే తీసుకోవాలన్నారు. అనంతరం హిందీ దివస్ వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి పొందిన గోల్డ్ మెడల్ సాధించిన రామును కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, ఆర్‌బీఎస్‌కె పీఓ డాక్టర్ సీహెచ్ భావన, ఇన్‌చార్జి డీపీఎం ధనలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కోఆర్డినేటర్లు కె కృష్ణారావు, జి.చిన్నయ్య, హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన వర్జీనియా ధర

గరిష్టంగా కేజీ రూ.408గా నమోదు

జంగారెడ్డిగూడెం: రైతుల మోముల్లో చెరగని చిరునవ్వును అందిస్తూ ఈ ఏడాది వర్జీనియా వేలం ప్రక్రియ కొనసాగుతోంది. వర్జీనియా ధర మళ్లీ పెరుగుతూ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత శుక్రవారం నాడు ఆల్‌టైం గరిష్టాన్ని నమోదు చేసి ఆనందాన్ని పంచిన కొద్ది రోజుల్లోనే మరో నూతన గరిష్టాన్ని నమోదు చేసి ఆశ్చర్యపరిచింది. గత శుక్రవారం ఎస్‌ఎల్‌ఎస్ ఏరియా పరిధిలో కేజీ ఒక్కింటికి అత్యధిక ధర రూ.407 పలికింది. ఆ ధరను చెరిపివేస్తూ మంగళవారం మరో రూపాయి పెరిగి రూ.408 నమోదు చేసింది. ఎస్‌ఎల్‌ఎస్ ఏరియా పరిధిలో ఐదు వేలం కేంద్రాల్లో మూడు వేలం కేంద్రాల్లో రూ.408 నమోదైంది. అంతర్జాతీయ డిమాండ్, నాణ్యత కలిగిన పొగాకుతోనే ఈ రికార్డు ధరలు నమోదు అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఎస్‌ఎల్‌ఎస్ ఏరియా పరిధిలోని జంగారెడ్డిగూడెం -1, జంగారెడ్డిగూడెం-2, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో అత్యధికంగా రూ.408 నమోదు అయ్యింది. దేవరపల్లి వేలం కేంద్రంలో రూ.400, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.399 ధర పలికింది. మొత్తం ఐదు వేలం కేంద్రాల్లో 6,669 బేళ్లు రైతులు అమ్మకానికి తీసుకురాగా, వీటిలో 4,444 బేళ్లు అమ్ముడైనట్లు రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది సగటు ధర రూ.331.58గా నమోదైంది.



వర్జీనియా పొగాకు బేళ్లు

స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములవ్వాలి

భీమవరం (ప్రకాశంచౌక్): చెత్త రహిత భారతదేశం నిర్మాణం లక్ష్యంగా అందరూ భాగస్వాములు కావాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో నిర్వహించిన ‘స్వచ్ఛతా హీ సేవా’ ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, భీమవరం, ఉండి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, రఘురామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద రైల్వే అండర్ పాస్ పక్క రోడ్డులో చెత్తను శుభ్రం చేశారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచాతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,, చెత్త రహిత భారతదేశం లక్ష్యంగా అందరూ భాగస్వాములు కావాలన్నారు.



స్వచ్ఛతా హీ సేవలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, చిత్రంలో ఎమ్మెల్యేలు అంజిబాబు, రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ నాగరాణి

కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సమాజం పరిశుభ్రంగా ఉంటేనే అభివృద్ధి, ఆరోగ్యం సాధ్యమన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయడం ఆరోగ్యకర లక్షణం కాదని, ఇలాంటి అలవాట్ల నుంచి మార్పు తెచ్చేందుకే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టే ఈ కార్యక్రమాలు లక్ష్యాలు నూరు శాతం సాధించడానికి సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ అపరిశుభ్రంపై యజ్ఞం చేయాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు మాత్రమే చెత్తను అందించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జయసూర్య, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, గ్రామ వార్డు సచివాలయం అధికారి కేసీహెచ్ అప్పారావు, ఆర్డబ్ల్యూఎస్ అధికారి బి.నాగేశ్వరరావు, తహసీల్దార్ రావి రాంబాబు, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు(మెట్రో): సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని 2023– 24కు ప్రకటించిన వివిధ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.ఎస్. ప్రభాకర రావు ఒక ప్రకటనలో తెలిపారు. 38 విభాగాల నుంచి 41 రంగాల అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను టూరిజం వైబ్‌సైట్‌లో ఉంచామని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీ లోపు అందజేయాలని కోరారు. వివరాలకు 63099 42024 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఐటీఐల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ ఐటీఐల్లో మిగిలిన సీట్ల కోసం ఈ నెల 26న సాయంత్రం 5 గంటలలోపుగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులేనన్నారు. ఆసక్తి ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకి వెళ్ళి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. రసీదు పొందనివారు కౌన్సెలింగ్‌కు అనర్హులన్నారు. మరిన్ని వివరాల కొరకు 08816 297093, 9676099988 నెంబర్లకు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు.

కొనాలంటే చుక్కలే

- ధరలతో బెంబేలెత్తిస్తున్న కూరగాయాలు, గుడ్లు, చికెన్
- వర్షాలు, వదరలతో కూరగాయల పంటలకు నష్టం
- కిలో రూ. 60 నుంచి రూ.100 పలుకుతున్న కూరగాయలు
- దిగుమతి సుంకంతో వంట నూనెల ధరలకు రెక్కలు
- ప్యాకెట్‌కు రూ.25 వరకు పెరుగుదల
- కిలో రూ.300కు చేరిన చికెన్, రూ.ఏడు పలుకుతున్న గుడ్డు

సాక్షి, భీమవరం: మార్కెట్‌లో సరుకుల ధరలు మండిపోతున్నాయి. వర్షాలు, వరదలతో కూరగాయల పంటలు దెబ్బతిని వాటి ధరలకు రెక్కలొచ్చాయి. దిగుమతి సుంకం దెబ్బకు ఆయిల్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేక చికెన్ ధర కిలో రూ.300కు చేరుకోగా గుడ్డు రూ.ఏడు పలుకుతోంది. ఏం కొనేట్లు.. తినేట్టు లేక పేద వర్గాల వారు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి, పెనుగొండ, ఆచంట మండలాల్లోని గోదావరి లంక గ్రామాలు, కుక్కునూరు, వేలేరుపాడు, నూజివీడు, చింతలపూడి, ఆగిరిపల్లి తదితర ప్రాంతాల్లోని ఐదు వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతున్నాయి. జిల్లాను ఆనుకుని ఉన్న బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలోని లంక, చాగల్నాడు మెట్ట గ్రామాల్లోని 16 వేల ఎకరాల్లో బీర, బెండ, దొండ, వంకాయ, కాకర, ఆనప తదితర పంటలు సాగవుతున్నాయి. జూలై చివరి వారంలో వచ్చిన భారీ వర్షాలు, గోదావరి వరదలతో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. లంకల్లోని వరదనీరు తగ్గాక అక్కడక్కడా మిగిలి ఉన్న పంటలు తేరుకుంటున్నాయనుకుంటున్న తరుణంలో తాజాగా గోదావరి, కొల్లేరుకు వచ్చిన వరదలు మొత్తం ముంచెత్తాయి.



ధరలకు రెక్కలు : స్థానికంగా సాగవుతున్న పంటలు దెబ్బతినడంతో వాటి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. మరోపక్క గణేష్ నవరాత్రి వేడుకలు ముగియడంతో జిల్లా వ్యాప్తంగా అన్నసమారాధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీలు భారీ ఎత్తున అన్న సంతర్పణలు నిర్వహిస్తుండటంతో కూరగాయాలకు డిమాండ్ పెరిగి వాటి ధరలకు రెక్కలొచ్చాయి. వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. బీర, బెండ, దొండ, వంగ తదితర రకాల కూరగాయలు కిలో రూ.60 పైనే పలుకుతుండగా చిక్కుళ్లు రూ.160కు చేరాయి. గతంలో రూ.15కు దొరికే ఆనపకాయ రూ.30 నుంచి రూ.40 పలుకుతోంది. మరోపక్క పాత ఉల్లిపాయల ధరలు రూ.50 నుంచి రూ.60కు చేరి దిగిరావడం లేదు. గోదావరి వరదలతో మహరాష్ట్రలోని ఉల్లిపంట దెబ్బతినడంతో దిగుమతులు తగ్గిపోయి ధరలు పెరిగాయంటున్నారు. కోల్‌కతా, బెంగుళూరు ప్రాంతాల నుంచి దిగుబతి చేసుకునే బంగాళదుంప, బీట్‌రూట్, క్యారెట్, క్యాబేజీ ధరలు పెరుగుతున్నాయి. బయటి మార్కెట్‌లో ధరలు ఇలా ఉంటే తోపుడు బండ్లు, సైకిళ్లపై అమ్మకాలు చేసే వారి వద్ద ఈ ధరలు మరింత అధికంగా ఉంటున్నాయని వినియోగదారులు అంటున్నారు. లంకల్లోని వరద నీరు తగ్గితేనే గాని కొత్త పంటలు వేసేందుకు వీలులేని పరిస్థితి. మెట్ట ప్రాంతంలోని కూరగాయల పంటలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు మరో మూడువారాల పైనే సమయం పడుతుందని వ్యాపారులు అంటున్నారు. వచ్చే నెల మొదటి వారంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు మొదలుకానుండగా నవంబరులో కార్తికమాసం ప్రారంభం కానుంది. వీటి వినియోగం మరింత పెరగనుండటంతో ఇప్పట్లో ధరలు దిగివచ్చే అవకాశం లేదని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

కూరగాయలు	ధరలు
వంకాయలు	రూ. 80
బీరకాయలు	రూ. 50
బెండకాయలు	రూ. 80
దొండకాయలు	రూ. 80
పచ్చిమిర్చి	రూ. 40
క్యారెట్	రూ. 40
బీట్‌రూట్	రూ. 50
బంగాళాదుంప	రూ. 40
చిక్కుడు	రూ.160
కాలీఫ్లవర్	రూ. 40
ములక్కాడ ఒకటి	రూ. 20



చికెన్, గుడ్డు ధరలు పైపైకి..

సీజనల్ వ్యాధుల బెడద, శ్రావణ మాసం ప్రభావంతో గత నెలలో కిలో రూ.200కు పడిపోయిన చికెన్ ధర పెరుగుతోంది. జిల్లాలోని పౌల్ట్రీల్లో ఏడు లక్షల వరకు బ్రాయిలర్ కోళ్ల పెంపకం జరుగుతుంది. చవితి ఉత్సవాల నేపథ్యంలో అమ్మకాలు పెద్దగా ఉండవని పూర్తిస్థాయిలో కొత్త బ్యాచ్‌లు వేయకపోవడంతో డిమాండ్‌కు తగిన స్థాయిలో కోళ్లు లేక వాటి ధర పెరుగుతోంది. ప్రస్తుతం కిలో రూ.280 నుంచి రూ.300కు చేరింది. జిల్లా నుంచి ఒడిశా, పశ్చిమబెంగాల్, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు గుడ్లు ఎగుమతులు ఆశాజనకంగా ఉండటంతో కొద్దిరోజులుగా గుడ్డు ధర పుంజుకుంటోంది. మంగళవారం నాటికి నెక్ ప్రకటిత రైతు ధర రూ.5.40కు చేరుకోగా రిటైల్ మార్కెట్‌లో రూ.ఏడుకు చేరింది. దీంతో వీటిని కొనుగోలు చేసేందుకు సామాన్యులు గుడ్లు తేలేస్తున్నారు.

కాగుతున్న వంట నూనెలు

ఎడిబుల్, క్రూడ్ ఆయిల్స్‌పై దిగుమతులపై టాక్స్ పెంపుదల ఆయిల్ ధరలపై ప్రభావం చూపింది. రిఫైన్డ్ ఆయిల్స్‌పై పన్నును 13.75 శాతం నుంచి 35.75 శాతానికి, క్రూడ్ ఆయిల్‌పై 5.5 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని 27.50 శాతానికి పెంచడంతో ఒక్కసారిగా ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. 850 గ్రాముల ఆయిల్ ప్యాకెట్‌పై రూ.19 నుంచి రూ.25 వరకు పెరిగి పేదవర్గాల వారికి భారంగా మారింది.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పోలవరం రూరల్: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలవరం పంచాయతీ పరిధిలోని బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న కోటేశ్వరరావుకు సుజాతతో 2017లో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. గత రెండేళ్లుగా కోటేశ్వరరావు వివాహమై భర్త నుంచి వేరుగా ఉంటున్న మరో మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడు. విషయం తెలిసిన సుజాత భర్తను నిలదీయగా, ఆమెపై దురుసుగా ప్రవర్తించాడు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయగా, వారు కోటేశ్వరరావును మందలించారు. దీంతో సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కోటేశ్వరరావు తిరిగి రాలేదు. దీనిపై సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

4 ఇసుక ట్రాక్టర్ల సీజ్

జంగారెడ్డిగూడెం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 4 ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్సై షేక జబీర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని మైసన్నగూడెం శివారులో తనిఖీలు నిర్వహిస్తుండగా, జల్లేరు వాగు నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా జుజ్జవరపు హరిబాబు, తగరం నాగరాజు, ప్రగఢ సర్వేశ్వరరావు, కేదాసు సోంబాబు 4 ట్రాక్టర్‌లపై ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. దీంతో వీరిపై కేసు నమోదుచేసి ట్రాక్టర్‌లను, ఇసుకను సీజ్ చేసినట్లు చెప్పారు.

24న అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 24వ తేదీన ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉదయం 8 గంటలకు పోటీలు చేపడతామని వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొని జిల్లా జట్లకు ఎంపికైన వారు అక్టోబర్ 4వ తేదీ నుంచి 6 వరకూ రాజమహేంద్రవరం ఏఆర్‌టీఎస్ కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వివరించారు. అండర్ 10, 12, 14, 16, 18, 20 విభాగంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 62814 31202, 76600 59833 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టి..

హనుమాన్ జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులో ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం ఏపూరుకు చెందిన భోగోలు వెంకటేష్ (28) బైక్‌పై విజయవాడ వైపు నుంచి హనుమాన్ జంక్షన్ వస్తుండగా సోమవారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. రహదారిపై టిప్పర్‌ను నిలిపి ఉంచడంతో రాత్రి వేళలో దాన్ని గుర్తించని వెంకటేష్ బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొలువులు ఊడినట్టేనా?

- అక్టోబర్ 1 నుంచి మద్యం నూతన పాలసీ
- దుకాణాల కోసం కూటమి నేతల ప్రయత్నాలు
- అగమ్యగోచరంగా మద్యం షాపుల ఉద్యోగుల పరిస్థితి



తణుకులో ప్రభుత్వ మద్యం దుకాణం

తణుకు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటివరకూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగాలు ఊడినట్టే అనిపిస్తోంది. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అక్టోబర్ 1 నుంచి అమలు చేస్తామని ప్రకటించడం, ఇదే విషయాన్ని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కూడా ఇటీవల మెరుగైన మద్యం పాలసీని రూపొందిస్తున్నామని, ధరలు కూడా తగ్గిస్తున్నామని ప్రకటించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తణుకు సర్కిల్ పరిధిలోని తణుకు పట్టణంతో పాటు తణుకు, ఇరగవరం, పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో మొత్తం 35 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో తణుకు పట్టణ పరిధిలోని ఒక్కో షాపులో ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్ ఉండగా మండలాల్లో మాత్రం ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్ చొప్పున ఉన్నారు. ఈ లెక్కన మొత్తం 150 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో సూపర్‌వైజర్‌కు నెలకు రూ. 19వేలు, సేల్స్‌మెన్‌కు రూ.16,500, వాచ్‌మెన్లకు రూ.12 వేలు జీతం ఇస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన జగనన్న ప్రభుత్వం

2019కి ముందు ఉన్న మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిన దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. అవన్నీనూ రాజకీయ నాయకుల అజమాయిషీలోనే నడిచేవి. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అవినీతి అక్రమాలకు చెక్‌పెట్టింది. అంతేకాకుండా ప్రభుత్వ మద్యం షాపులతో పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. దాదాపు ఐదేళ్ల పాటు ప్రభుత్వ దుకాణాల్లో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకునేవారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో వీరి ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారాయి.

ప్రస్తుత కూటమి పాలనలో...

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ కారణంగా ప్రైవేట్ ఏజెన్సీలు మద్యం షాపులను నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ సైతం కొనసాగుతోంది. మద్యం పాలసీతో అంతిమంగా లబ్ధి పొందేది కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలేనని చర్చకు తావిచ్చింది. ఇక ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బందిని కొనసాగిస్తారా లేక తొలగిస్తారా? అనే విషయంపై స్పష్టత లేకపోవడం ఒకవేళ తమను విధుల నుంచి తొలగిస్తే తాము ఆందోళన బాట పట్టక తప్పదని చెబుతున్నారు. మరోవైపు కూటమి నాయకులు మద్యం షాపుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే అదంతా ప్రభుత్వ పాలసీ అనీ తమకెలాంటి సంబంధం లేదంటున్నారు.

రాతి స్తంభాలపై శాసనాలకు రంగు తొలగింపు



రాతి స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. ఆలయంలో బేడా మండపంలోని రాతి స్తంభాలపై ఉన్న శాసనాలపై రంగులు తొలగించాలని వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించినట్లు విజయవాడ పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ పితా సురేష్ తెలిపారు. ట్రయల్‌గా కెమికల్స్‌తో ఓ స్తంభంపై ఉన్న పెయింట్‌ను కడిగించినట్లు చెప్పారు. అలాగే బేడా మండపంలో స్తంభాల నుంచి వర్షం కారుతుందని వాటిపై ఆలయ కార్యనిర్వహణాధికారికి పలు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఏడీ కె.తిమ్మరాజు, ఏలూరు ఏఈ నల్లగోపు రాజ్‌కుమార్, ఆలయ ఈవో ముత్యాల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ స్వామి, బెజవాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించొద్దు

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించవద్దని, సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని, కొబ్బరి, ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం స్థానిక పవరుపేటలోని అన్నే భవనం నందు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని రైతాంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.కృష్ణయ్య మాట్లాడుతూ రోజురోజుకీ రైతుల సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. కష్టపడి పండించిన పంటలకు కనీస ధరలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావడం లేదని విమర్శించారు. ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయిస్తేనే రైతుకు మేలు జరుగుతుందన్నారు. కేరళ వామపక్ష ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు కల్పించి అన్నదాతలను ఆదుకుంటుందన్నారు. రుణ విమోచన చట్టం తీసుకువచ్చి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు కేరళ వామపక్ష ప్రభుత్వం రుణమాఫీ చేస్తోందని చెప్పారు. కనీసం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన విధంగా రాష్ట్రంలో రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు బిగిస్తే అవి రైతులకు ఉరితాడుగా మా జుతాయని చెప్పిన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ రైతులకు సమాధానం చెప్పాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేటు బీమా కంపెనీలకు పంటల బీమా పథకం అప్పగించవద్దని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 23, 24 తేదీల్లో మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కోనా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఘంటా పాపారావు, సున్నా వెంకట్రావు, గుర్రం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఇవ్వలేదని కుటుంబం వెలి

కామవరపుకోట: విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వలేదని ఓ కుటుంబాన్ని వెలివేశారు. కామవరపుకోట మండలం ఆడమిల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. ఆడమిల్లి గ్రామానికి చెందిన యడ్లపల్లి ప్రకాశానికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు, అందరికీ వివాహం కాగా, ఆ కుటుంబంలో 11 మంది ఉంటున్నారు. అదే గ్రామంలో యడ్లపల్లి ప్రకాశానికి చెందిన అతని ఇంటి ఎదురుగా వడ్లపల్లి నూతనం వెళ్లు రోడ్డులో సుమారు ఒక సెంటు ఖాళీ స్థలం ఉంది. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు ఆ స్థలం ఇవ్వమని తమ సామాజికవర్గంలోని కొందరు పెద్దలు అడుగగా ప్రకాశంతో సహా అతని కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో ఆ కుటుంబంతో ఎవరైనా మాట్లాడినా, వారిని వ్యవసాయ పనులకు పిలిచినా, రూ.5 వేల జరిమానా విధిస్తామని ఆ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు హుకుం జారీ చేశారు. అంతేకాకుండా ప్రకాశం కుటుంబ సభ్యుల మాట లెక్క చేయకుండా గ్రామ పెద్దలు అదే స్థలంలో దౌర్జన్యంగా ఇటీవల ఇటుకులతో నిర్మాణం చేపట్టారు. దీనితో ప్రకాశం ఆవేదనకు గురై ఆగస్టు 30న మృతి చెందాడు. అప్పటికే కక్ష పెంచుకున్న పెద్దలు, ప్రకాశం అంత్యక్రియలకు ఎవరూ వెళ్లకుండా వారి సామాజిక వర్గానికి చెందని వ్యక్తులను అడ్డుకున్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు తమతో ఎవరూ మాట్లాడటం లేదని, వ్యవసాయ పనులకు పిలవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రకాశం కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేసి వెలి వేసిన వారిపై చర్య తీసుకోవాలని, లేకపోతే కుటుంబ మొత్తం ఆత్మహత్య చేసుకుంటామని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రకాశం కుటుంబసభ్యులు

గంటలోనే చోరీ సొమ్ము రికవరీ

నూజివీడు: బ్యాంకులో డిపాజిట్ చేయడానికి వెళ్లిన వ్యక్తి డబ్బులు చోరీకి గురికాగా, గంటలోనే పోలీసులు పట్టుకొని అప్పగించిన ఉదంతమిది. దీనికి సంబంధించి పట్టణ సీఐ పీ సత్య శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆగిరిపల్లికి చెందిన పల్లగాని నాగరాజు బ్యాంకులోని తన ఖాతాలో రూ.96 వేలు డిపాజిట్ చేసేందుకు మంగళవారం ఉదయం పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచికి వచ్చాడు. అక్కడ డిపాజిట్ ఫారం రాస్తుండగా పక్కనే మాటు వేసి ఉన్న ఓ వ్యక్తి ఆ డబ్బులను తస్కరించుకొని వెళ్లిపోయాడు. ఫారం రాసిన తరువాత చూసుకోగా డబ్బులు లేకపోవడంతో బాధితుడు వెంటనే 112కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు వెంటనే స్పందించి రంగంలోకి దిగి బ్యాంకులోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా గంటలోనే నిందితుడిని అదుపులోకి తీసుకొని రూ.96వేలు రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. హుటాహుటిన స్పందించి దొంగను చాకచక్యంగా పట్టుకుని అప్పగించిన కానిస్టేబుల్ జే నాగమల్లేశ్వరరావును పట్టణ సీఐ పీ సత్యశ్రీనివాస్ అభినందించి నగదు రివార్డును అందజేశారు.



కానిస్టేబుల్ నాగమల్లేశ్వరరావుకు నగదు రివార్డు అందజేస్తున్న పట్టణ సీఐ పీ సత్య శ్రీనివాస్

కొబ్బరి ప్రాసెసింగ్ పది శాతం పెరగాలి

కొబ్బరి ఉత్పత్తులపై శాస్త్రవేత్తలకు శిక్షణ

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో రెండుశాతంగా ఉన్న కొబ్బరి ప్రాసెసింగ్ మార్కెట్‌ను పదిశాతానికి పెంచాల్సిన అవసరం ఉందని వెంకట్రామన్నగూడెంలో జరిగిన శాస్త్రవేత్తల శిక్షణా కార్యక్రమంలో పలువురు పేర్కొన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు విజయవాడ, కేంద్ర కార్యాలయం కొచ్చి, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కేవీకేలలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కుమార్ వెల్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షకు పైగా హెక్టార్లలో సాగులో గల కొబ్బరి పంట, ఉత్పత్తి, ఉత్పాదకత, విలువ జోడింపువంటి వాటి ద్వారా రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. కొబ్బరితో చాక్లెట్లు తయారీ, బిస్కెట్స్, కొబ్బరి చిప్స్, కొబ్బరిజామ్, కొబ్బరితో వర్జిన్ కోకోనట్ ఆయిల్ తయారీ విషయాలను కేరళ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు అనిత, సోనూ వివరించారు. వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పలు ఉద్యాన పంటలలో నూతన సాంకేతికతను, ప్రాసెసింగ్ గురించి వివరించారు. మూడు రోజుల పాటు జరుగనున్న శిక్షణలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థ నుంచి 21 మంది శాస్త్రవేత్తలు పాల్గొని, కొబ్బరితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, వ్యాపార సరళి గురించి రైతులకు, మహిళలకు వివరిస్తారు. రాష్ట్ర ఉద్యానశాఖ అడిషినల్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, ఉద్యాన వర్సిటీ పరిశోధన సంచాలకులు ఎం.మాధవి, విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు, కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ ,ఉద్యాన శాఖ జేడీ దేవముని రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు దేవీవరప్రసాదరెడ్డి, దీప్తి, రాఘవేంద్రరెడ్డి, చిరంజీవి, కొబ్బరి అభివృద్ధి బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి ప్రాసెసింగ్ శిక్షణలో శాస్త్రవేత్తలు

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ అనంతపురం జిల్లా హిందూపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండర్ 15 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో తణుకు వివేకానంద గ్లోబల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనా సాయి తెలిపారు. ఈపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బాలుర విభాగంలో సమ్మెట్ల హేమంత్ డబుల్స్‌లో బంగారు పతకం, మిక్సిడ్ విభాగంలో బంగారు పతకం, సింగిల్స్‌లో రజతం సాధించినట్లు తెలిపారు. అలాగే బాలికల డబుల్స్ విభాగంలో తమ విద్యార్థిని మనోజ్ఞ బంగారు పతకం, మిక్సిడ్ విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను ఎస్‌కేఎస్‌డీ విద్యాసంస్థ కరస్పాండెంట్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి, కార్యదర్శి మెంటే వంశీ కృష్ణ, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఆర్ రవీంద్రనాథ్, కోచ్ సతీష్ తదితరులు అభినందించారు.

బోల్తా పడిన లారీ.. డ్రైవర్ మృతి

ఏలూరు టౌన్: లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘనటలో డ్రైవర్ మృతి చెందాడు. వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా విసన్నపేటకు చెందిన మాదాసు రంగబాబు (47) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం జామాయిల్ బాదుల లోడు వేసుకుని రాజమహేంద్రవరం వెళ్తుండగా మార్గమధ్యలో ఏలూరు జాతీయరహదారి వంగూరు బ్రిడ్జి వద్ద అదుపు తప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. రంగబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వైద్యురాలిపై దౌర్జన్యాన్ని ఖండించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు సర్వజన ఆసుపత్రి నందు నైట్ డ్యూటీ చేస్తున్న వైద్యురాలిపై పేషెంట్ తాలూకా వ్యక్తులు దౌర్జన్యం చేయడాన్ని ఖండించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) నాయకురాళ్లు ఏ.శ్యామలారాణి, జి.శారద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోనందువల్లే వైద్యులపై రోజురోజుకీ దాడులు పెరుగుతున్నాయన్నారు. పోలీసు శాఖ స్పందించి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి, వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ దేశమంతటా వైద్యులకు తగిన రక్షణ కల్పించేందుకు చట్టం చేయాలని చేస్తున్న డిమాండ్‌ను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధాకర్‌కు ఐద్వా జిల్లా కమిటీ తరుపున వినతిపత్రం అందజేశారు.

వంట నూనె దుకాణాలపై దాడులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వంట నూనెల దుకాణాలపై విజిలెన్సు, పౌర సరఫరా, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు. అమ్మకపు ధర నమోదు చేయకపోవడం, నిల్వల్లో వ్యత్యాసాలు, వేర్వేరు ధరలు ముద్రించడం వంటి అంశాలను గుర్తించి ఆయా వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు. ఏలూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వీ శ్రీరాంబాబు ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు చెప్పారు.

- ఏలూరు నగరంలోని గాదంశెట్టి వెంకట సుబ్బారావు హోల్‌సేల్ ఆయిల్స్ నందు నూనె నిల్వలు తనిఖీ చేసి అందులో 15 కేజీల ఆయిల్ డబ్బాలపై అమ్మకపు ధర నమోదు చేయని కారణంగా షాపు యజమానిపై లీగల్ మెట్రాలజి అధికారులు కేసు నమోదు చేశారు.
- నూజివీడు పట్టణంలో శ్రీ విజయలక్ష్మి ఎంటర్‌ప్రైజస్, హోల్‌సేల్ ట్రేడర్స్‌లో తనిఖీ చేయగా నిల్వలలో వ్యత్యాసం గుర్తించి తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.
- తాడేపల్లిగూడెం పట్టణంలో రోహిణి ట్రేడర్స్, రోహిణి ఎంటర్ ప్రైజస్, హోల్ సేల్ ఆయిల్ ట్రేడర్స్‌లో తనిఖీ చేయగా నిల్వలలో వ్యత్యాసం గుర్తించారు.
- తణుకు పట్టణంలో వరలక్ష్మి జనరల్ స్టోర్స్, ఆయిల్ ట్రేడర్స్, ప్యాకింగ్ యూనిట్ అయిన మెస్సర్స్ గణేష్ ఆగ్రో ఆయిల్ ఇండస్ట్రీస్‌లో నూనె నిల్వలు తనిఖీ చేసి అందులో ఒకే రకమైన ఆయిల్ పాకెట్లపై వేర్వేరు ధరలను గుర్తించి షాపు యజమానిపై కేసు నమోదు చేశారు.
- భీమవరం పట్టణంలో కారుమూరి వెంకటేశ్వరరావు అండ్ సన్, ఆయిల్, కిరాణా మర్చంట్‌లో నూనె నిల్వలు తనిఖీ చేసి అందులో 15 కేజీల ఆయిల్ డబ్బాలపై అమ్మకపు ధర నమోదు చేయని కారణంగా, తూనికల కాటాపై సంబంధిత ముద్ర లేని కారణంగా షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, డీఈ పీ.శ్రీనివాసన్, సీఐ పీ.శివరామకృష్ణ, ఏఈఈలు టీ. శ్రీనివాసరావు, ఎం.రూపేష్ వర్మ, ఎం.అనిల్ బాబు, ఏజీ పీ.శ్రీధర్, తహసీల్దార్ బీ. కన్యాకుమారి, ఏఓ పీ సురేష్, ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, పౌర సరఫరా అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.



తణుకులోని వరలక్ష్మి జనరల్ స్టోర్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

మద్యం మత్తులో మహిళ హత్య

పెదపాడు: తనతో సహజీవనం చేస్తున్న మహిళను ఓ వ్యక్తి తీవ్రంగా కొట్టి గాయపర్చడంతో ఆమె మృతి చెందిన ఘటన పెదపాడు మండలంలోని వసంతవాడ గ్రామంలో చోటుచేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వసంతవాడ గ్రామానికి చెందిన గుజ్జుల జాన్ కుమార్తె గుజ్జుల అనిత(37) బాపులపాడు మండలంలోని వీరవల్లి సమీపంలోని నారాయణపురం గ్రామానికి చెందిన వివాహితుడు మెండెం నవీన్‌తో కొంతకాలంగా సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో ఆమె ఏడోనెల గర్భం దాల్చింది. సోమవారం రాత్రి ఆమె, నవీన్ గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో అసహనానికి గురైన నవీన్ అక్కడే ఉన్న పాత్రతో ఆమెను బలంగా కొట్టాడు. అనంతరం బయటకు వెళ్లిపోతున్న అతడిని ఆమె మళ్లీ ఇంటికి తీసుకువెళ్లింది. తరువాత మళ్లీ గొడవ పడటంతో నవీన్ మద్యం మత్తులో బలంగా గోడకేసి మోదడంతో అనిత మృతి చెందింది. మృతురాలి చెల్లెలు కిర్లంపూడి అరుణ ఫిర్యాదు మేరకు సీఐ కే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పెదపాడు ఇన్‌చార్జి ఎస్సై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఆపైన ఉత్తీర్ణులైన వారు 15 నుంచి 30 ఏళ్ల లోపు వయసు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94934 82414 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

లాయర్ కార్తీక్ మృతిపై కేసు నమోదు

ఏలూరు (టూటౌన్): హైకోర్టు న్యాయవాది పయనం కార్తీక్ మరణానికి కారణమైన భార్య మనీషా ప్రియాయాదవ్, ఆమె కుటుంబ సభ్యులపైనా ఏలూరు టూటౌన్‌లో కేసు నమోదు చేసినట్లు కుటుంబ సభ్యులు, న్యాయవాది నోముల రాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గెల్లబోయిన మహేంద్రనాథ్ యాదవ్ కుమార్తె గెల్లబోయిన మనీషా ప్రియా, 2017లో తన కుమారుడ్ని ఇష్టపూర్వకంగా ప్రేమించి ఏలూరులోని షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక వివాహం చేసుకున్నాడని మృతుని తండ్రి పయనం రత్నరాజు తెలిపారు. ఆరేళ్ల బాగానే కాపురం చేసిన అనంతరం తన భార్యను తన దగ్గరకు రాకుండా ఆమె కుటుంబ సభ్యులు కుట్రలు చేశారని, దాన్నితట్టుకోలేక కార్తీక్ ఆగస్టు 14న తుది శ్వాస విడిచినట్లు చెప్పారు. అప్పటినుంచి కుటుంబ సభ్యులు, సహచర న్యాయవాదులు కేసు నమోదు చేయాలంటూ కోరుతూ వస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి భార్య మనీషా ప్రియా, గెల్లబోయిన మాధవి, గెల్లబోయిన స్వప్న ప్రియా, మారబోయిన శ్రావణ్ కుమార్, గెల్లబోయిన శ్రావణ్ కుమార్‌లపై పోలీసులు కేసు నమోదు చేయడం పట్ల కుటుంబ సభ్యులు, సహచరా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరానికి హాజరైన 26 మంది వృద్ధులు



ఉచిత వైద్యసేవలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 26 మంది వృద్ధులు హాజరయ్యారు. రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో హాజరైన రోగులకు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందించి బీపీ, సుగర్ పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆహార విషయంలో వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సంఘ ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వార ఒపూడి బాబిరెడ్డి, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, సీహెచ్ సాధు తదితరులు పాల్గొన్నారు.

కారుమూరి పరామర్శ



జక్కంశెట్టి సత్య రాజేంద్రప్రసాద్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు టౌన్: తణుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులుగా వ్యవహరిస్తున్న తూర్పు గోదావరి జిల్లా పెరవలికి చెందిన జక్కంశెట్టి సత్య రాజేంద్రప్రసాద్‌ను మంగళవారం మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు రాజేంద్రప్రసాద్‌కు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

తల్లిపేరున మొక్క నాటాలి



గూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ తల్లి పేరిట ఒక మొక్కనాటితే మంచిదని ఇన్‌చార్జి ఆర్డీఓ బిఎస్ఎన్.రెడ్డి కోరారు. స్వచ్ఛత హీ సేవా ర్యాలీ సందర్భంగా మునిసిపల్ కార్యాలయం నుంచి మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. వాతావరణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ మురళీకృష్ణ , బీజేపీ, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నూతన కార్యవర్గం ఎన్నిక



తణుకులో నూతనంగా ఎన్నికైన ఎన్‌ఎంయూ అసోసియేషన్ కార్యవర్గం

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్మికులకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అండగా నిలబడుతుందని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరాజు, ఎ.సూర్యచంద్రరావు అన్నారు. తణుకు ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతం చేసేందుకు నూతనంగా ఎన్నికైన నాయకులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్.ఏసుబాబు, కార్యదర్శిగా బీవీఎస్ సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా కేవీ రత్నం, చైర్మన్‌గా టీఎస్‌రావు, వైస్‌చైర్మన్‌గా ఎల్ఎస్ రావు, గంగాభవాని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాంబశివరావు, పబ్లిక్ సిటీ సెక్రటరీగా కోరాడ దుర్గాప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) ఎంపికలు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు సంబంధించి ఈ నెల 19వ తేదీ గురువారం నుంచి 21వ తేదీ శనివారం వరకు 6 విభాగాలలో ఆటల పోటీలు జరగనున్నాయి. ఎంఈఓలు వి.హనుమ, పీఎంకే జ్యోతిలు పర్యవేక్షణ చేయనున్నారు. 19వ తేదీన వాలీబాల్, చెస్, 20వ తేదీన కబడ్డీ, బాడ్మింటన్ (షటిల్), 21న ఖో ఖో, యోగా ఎంపికలు ఉంటాయని, వీటిలో ఎంపికైన క్రీడాకారులు 24,25 తేదీలలో నియోజకవర్గ స్థాయి ఎంపికలు ఉంటాయని మండల కోఆర్డినేటర్ ఎ.ఈశ్వర్ వెల్లడించారు.

నాడు ఇంపు.. నేడు కంపు

- దుర్గంధంగా మారిన ప్రభుత్వ పాఠశాలల టాయిలెట్లు
- యాసిడ్స్ కూడా సరఫరా చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం
- తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో దుర్వాసనతో టాయిలెట్లు
- స్వీపర్స్‌కు వేతనాలు నిల్



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో తరగతి గది ముందు చెత్తాచెదారాలతో నిండిన దృశ్యం



జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థినుల టాయిలెట్స్‌కు ఊడిన తలుపు



తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో విద్యార్థినులు టాయిలెట్స్ కు వెళ్లకుండా అడ్డంగా పెట్టిన దృశ్యం.



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో నీటి సరఫరా లేక విద్యార్థుల యూరినల్స్ సింక్ దుస్థితి. (అంతరచిత్రం)

తణుకు అర్బన్: భావితరాలను తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు వసతుల లేమితో కునారిల్లుతున్నాయి. పాఠశాలల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల అపరిశుభ్రత వాతావరణంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిర్మించిన మరుగుదొడ్లు దుర్గంధంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరుగుదొడ్లలోకి వెళ్లాలంటేనే భయమేస్తోందంటూ విద్యార్థులు సైతం గగ్గోలు పెడుతున్నారు. మరుగుదొడ్లలో సింక్‌లు, టైల్స్ శుభ్రపరిచేందుకు ప్రభుత్వం ఇవ్వాల్సిన మూడు రకాల యాసిడ్స్‌తోపాటు చీపుర్లు, బ్రష్‌లు వంటి సామాగ్రి ఈ 100 రోజుల కూటమి ప్రభుత్వ హయాంలో ఇంతవరకు ఇవ్వకపోవడంతో టాయిలెట్స్ కంపుకొడుతున్న దుస్థితి. అసలే ఒక పక్క వైరల్, విష జ్వరాలు విజృంభిస్తుండడంతో పాఠశాలల్లో టాయిలెట్స్ దుస్థితి ఇలా ఉంటే తమ పిల్లలను ఎలా పంపించాలంటూ తల్లి తండ్రులు సైతం భయపడుతున్నారు.

గతమెంతో ఘనం..

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పేదింటి పిల్లలను కూడా డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచాలనే కృతనిశ్చయంతో నాడు నేడు నిధుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే సౌకర్యాలు కల్పించారు. ఇందులో భాగంగా పాఠశాల భవన నిర్మాణాలే కాకుండా విద్యార్థులకు అవసరమైన బెంచిలు, డెస్కులు, అధునాతంగా టాయిలెట్స్, స్క్రీన్‌బోర్డులు, క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విద్యార్థినులు టాయిలెట్స్‌కి వెళ్లాలంటే భయపడే పరిస్థితుల నుంచి నిరభ్యంతరంగా టాయిలెట్స్‌ని ఉపయోగించే స్థితికి తీసుకువచ్చారు. ఇందుకోసం తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి మొత్తం 163 పాఠశాలలు ఉండగా అందులో 140 పాఠశాలలను రెండు ఫేజ్‌లుగా విభజించి రూ. 149.53 కోట్లు నిధులు కేటాయించి తీర్చిదిద్దారు. అంతేకాకుండా ప్రతి 300 మంది విద్యార్థులకు ఒక స్వీపర్ చొప్పున నియమించి పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అంతటి సౌకర్యాలు కల్పించినప్పటికీ పాఠశాలల్లో మరుగుదొడ్లు దుర్గంధంగా మారి రోగాలకు ఆవాసాలుగా మారాయి. స్వీపర్స్ వేతనాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉంది.

చరిత్రకలిగిన పాఠశాల జెడ్పీ బాయ్స్ హైస్కూల్

దాతలు ఇచ్చిన భూమిలో ఏళ్ల తరబడి అత్యాధునిక భవన నిర్మాణాలతో రూపుదిద్దుకుని చరిత్రలో నిలిచిన తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలులోని టాయిలెట్స్ కూడా ప్రస్తుతం దుర్గంధంగానే మారాయి. 1341 మంది విద్యార్థుల సంఖ్యతో ఉన్న ఈ పాఠశాలలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్వీపర్స్ 4గురు తమ విధినిర్వహణలో పూర్తిస్థాయిలో పనిచేస్తున్నప్పటికీ శుభ్రతకు అవసరమైన సామాగ్రి ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం కావడంతో టాయిలెట్స్‌లో సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా బాలుర టాయిలెట్లు అయితే అత్యంత దుర్గంధంగా మారాయి. నీటి సరఫరా లేకపోవడంతో శుభ్రంచేసేందుకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాడైన వాటిని మరమ్మత్తులు చేయించే నిధులు లేకపోవడంతో సమస్య జటిలమైంది. ఇక బాలికల టాయిలెట్స్ అయితే బావున్నవాటిని మాత్రమే ఉపయోగిస్తూ మిగిలిన వాటికి వెళ్లకుండా అడ్డంగా చెక్కలు ఏర్పాటుచేశారు. పాడైపోయిన తలుపులతోపాటు తలుపులకు గెడలు విరిగిపోయి నీటి సరఫరా లేకపోవడం వంటి సమస్యలతో దుర్గంధపూరితంగా మారాయి. తరగతి గదుల ముందు సైతం చెత్తాచెదారాలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుందని విద్యార్థులు చెబుతున్నారు.

రెండురోజుల్లో పాఠశాలలకు నిధులు వస్తున్నాయి

ప్రభుత్వ పాఠశాలల్లోని టాయిలెట్స్ నిర్వహణకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నాయి. నిధులు విడుదల కాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తాం. స్వీపర్స్ వేతనాలు, పాఠశాల బడ్జెట్ నిధులు కూడా రెండు రోజుల్లో విడుదల కానున్నాయి.

– డి. మురళి సత్యనారాయణ, డీవైఈవో, తణుకు

బడ్జెట్ రాగానే మరమ్మతులు చేయిస్తాం

పాఠశాలలో పాడైన డోర్లు, సింక్‌లు ఇతర సామాగ్రి మరమ్మత్తులను పాఠశాల బడ్జెట్ నిధులు రాగానే చేయిస్తాం. టాయిలెట్స్ శుభ్రతకు ప్రాధాన్యత నిస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

– కె.పద్మావతి, తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వేల్పూరులో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: పారిశుద్ధ్యం, పరిశుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. మంగళవారం తణుకు మండలంలోని దువ్వ గ్రామంలో చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేల్పూరు గ్రామంలో ఎంపీడీవో పి అలివేలు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సునంద ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు అక్టోబరు 2వ తేదీ వరకూ జరుగుతాయని వాటిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వల్లూరి మోహనరావు, మాజీ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్ర ప్రసాద్, ఈవోపీఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, డ్వాక్రా ఏపీఎం రామకృష్ణ, గ్రామ కార్యదర్శి పీ శ్రీనివాస్, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్ఎంలు, విద్యార్థినీ, విద్యార్థులు సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండలంలోని దువ్వలోగ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీలు,, తేతలి, ముద్దాపురం, కోనాల, కొమరవరం, యర్రాయి చెరువు, మహాలక్ష్మి చెరువు గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలలో భాగంగా అవగాహనా ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకర్మ జయంత్యుత్సవం



విశ్వకర్మను ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వ నిర్మాత విశ్వకర్మ అని వేదాలు గోచరిస్తున్నాయని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం పెద్దలు అన్నారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ మల్లిఖార్జున కళ్యాణ మండపంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. అనంతరం పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పెదప్రోలు భాస్కర్, రామోజీ తాతాచార్యులు, వెంకటేశ్వరరావు, నాగు, విజయ్‌కుమార్, నిరంజన్ కుమార్, సతీష్, రాజు, మహేష్, రాంకీ, ఉమా, సాయిలు పర్యవేక్షించారు.

తణుకులో ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు

తణుకు టౌన్: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. మంగళవారం తణుకులోని బ్రహ్మంగారి ఆలయంలో స్వర్ణకార సంఘ హడహాక్ కమిటీ, ఉత్సవ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ యజ్ఞ మహోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాగమల్లి సాంబశివరావు, మందారపు నాగమనోహర్, కోరుమిల్లి సుబ్బారావు, కీర్తి శివప్రసాద్, పొడుగు రామాచారి, కొమ్మోజు రామకృష్ణ, గొల్లి హరికృష్ణ, సత్తిబాబు, ఎస్ ప్రసాద్, సొంత్యానం లక్ష్మణరావు, వెండి శ్రీను,లతో పాటు విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈకార్యక్రమాల్లో తణుకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో విశ్వ కర్మ యజ్ఞ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కోరుమిల్లి సుబ్బారావు, వెండిశ్రీను, లక్ష్మణరావు, సూరిబాబు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా విద్యుత్ దీపాల వెలుగులు





తణుకు రాష్ట్రపతి రోడ్డులో శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వెలుగులు

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వెలుగులు ఆకర్షణగా నిలిచాయి. ఆలయానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల్లో భాగంగా దేవతామూర్తుల రూపాలు భక్తులను అలరిస్తున్నాయి. తణుకు పట్టణ వాసులంతా విద్యుత్ దీపాల వెలుగులు చూసి తమ మొబైల్‌లో చిత్రీకరించుకుంటున్నారు. భక్తులు అధికసంఖ్యలో ఈ విద్యుత్ దీపాల వెలుగులను చూసేందుకు రాష్ట్రపతి రోడ్డువైపునకు వస్తున్నారు.

ఆర్టీసీలో స్వచ్ఛతాహి సేవా పక్షోత్సవాలు



తణుకు కార్గో కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న కార్గో కమర్షియల్ మేనేజరు జీఎల్‌పీవీ సుబ్బారావు

తణుకు అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల కార్గో కమర్షియల్ మేనేజరు జీఎల్‌పీవీ సుబ్బారావు అన్నారు. ఆర్టీసీ స్వచ్ఛతే సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలోని కార్గో కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల రీత్యా మొక్కల సంరక్షణ ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. నేటి వాతావరణ కాలుష్య పరిస్థితుల్లో వృక్షాల నుంచి అధికశాతం ఆక్సిజన్‌ను రాబట్టుకునే విధంగా కార్యాచరణ చేయాలని అన్నారు. అనంతరం స్వచ్ఛతే సేవా పక్షోత్సవాలకు సంబంధించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీపీటీఓ కార్యాలయ ఎస్‌టీఐ రామాని బాలసుబ్రహ్మణ్యం, డీఎంఈలు, కార్గో ఆపరేటర్లు, హమాలీలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



తణుకులో మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తణుకు టౌన్: బాలింతలు, గర్భిణులు, కిషోర్ బాలికలు అధిక పోషక విలువలు కలిగిన ఆకు కూరలు, ఇతర ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేయవచ్చని తణుకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం అరుణకుమారి చెప్పారు. పోషకాహార మహోత్సవాలలో భాగంగా మంగళవారం తణుకు పట్టణంలోని 9, 10 వార్డులలో గల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింత మహిళలు తమ ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాలని పోషకాహారం గురించి వివరించారు. కిషోరీ బాలికలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్త హీనత లేకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు కే మార్తమ్మ, సరోజని, అంగన్‌వాడీ కార్యకర్తలు పరమేశ్వరి, త్రివేణి, సరిత, ఎంస్‌కే రమాదేవి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తణుకు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్న పైపడిపర్రుకు చెందిన రిటైర్డ్ హోంగార్డుకు వైద్య ఖర్చుల కోసం తణుకు మానవత సంస్థ రూ.15 వేలు ఆర్థిక సహాయంతో పాటు రూ. 7 వేల మందులను అంద జేసినట్లు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. ఒబిలిశెట్టి మురళీ హరినాథ్ వారి స్నేహితుల అందించిన సహాయంతో బాదితునికి ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు. మంగళవారం పైడిపర్రులోని రిటైర్డ్ హోంగార్డు పిట్టా వీరరాఘవుల నివాసం వద్ద మానవత సంస్థ సభ్యులు విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. మంగళవారం తణుకులోని ఎస్కేఎస్‌ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవత సంస్థ తరపున 50 మొక్కలను నాటినట్లు తెలిపారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం పాఠశాలలో మాట్లాడుతున్న సర్పంచ్ చంద్రిక



పెంటపాడు: ప్రభుత్వ పాఠశాలలో మాత్రలు వేస్తున్న ఆరోగ్యసిబ్బంది



తణుకు అర్బన్: జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు నులి పురుగులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: శరీరంలోని నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపకరిస్తాయని ఎంపీహెచ్ఈవో జి.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల బాలబాలికలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో రెండు నుంచి 19 ఏళ్ల బాలబాలికలు 5,234మంది కాగా, 4852మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వివరించారు. మాత్రలు మింగడం ద్వారా రక్తహీనత, ఎదుగుదల లోపాన్ని నివారించవచ్చన్నారు. అలాగే అప్పారావుపేట గ్రామంలోనూ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్. మణి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ 19 ఏళ్లలోపు బాలబాలికలకు ఈ మాత్రలు పొందాలన్నారు. తద్వారా రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఫణీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు సత్యవాణి, రవికుమార్, ఏఎన్ఎంలు జి.రాజేశ్వరి, బి.రమాజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రలు పంపిణీ

పెంటపాడు: మండలంలోని పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఆల్బెండజోల్ (నులిపురుగుల మాత్రలు) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారులు తోట రాజేష్, మౌనిక, పూజిత, పవన్‌కుమార్‌లతో పాటు, ఎంపీహెచ్ఈవోలు సత్యనారాయణ, తేజోనాథ్, సాయిబాబా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తణుకు అర్బన్: మానవాళి అనారోగ్య సమస్యల్లో నులి పురుగుల పాత్ర అధికంగానే ఉంటుందని బ్యాంక్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ దానియెల్ రాజు అన్నారు. డీ వార్మింగ్‌డే సందర్భంగా మంగళవారం తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్, జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు చేరడం వలన విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు తీసుకోవడం వలన నులి పురుగులను నివారించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వరలక్ష్మి, కె.పద్మావతి, వార్డు సెక్రటరీలు షేక్ ఖాసింబీ, ఎన్.స్వర్ణకుమారి, ఆశ కార్యకర్తలు వి.లలిత, వి.భార్గవి పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మంగళవారం ఎంఈఓ హనుమ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగు మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టార్ సత్యనారాయణ, సీఆర్‌పీ నానిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత సెంటర్‌లో నులి పురుగు నివారణ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఆశాలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.